
చిన్నకథ

# శ్రీవారికి మెయిల్

మీతో చాలా చెప్పాల్సిన విషయాలున్నాయి. కాని, మీరు వినే స్థితిలో లేరు. మామూలు ప్రపంచంలో లేరు. ఈ-మెయిల్స్ తప్ప మీరు మరేవీ చూడరు కనుక బయట సైబర్‌కేఫ్‌కి వెళ్లి దీన్ని పంపుతున్నా! క్షమించండి. మరోదారి నాకు కనిపించలేదు. ఇంట్లో ఏం జరుగుతోందో మీకు చెప్పటం నా ధర్మం. నాలుగేళ్ల నాడు మీరు కంప్యూటర్‌లో తల దూర్చి మామూలు ప్రపంచాన్ని మర్చిపోయినప్పట్నించీ మనింట్లో చాలానే జరిగాయి!

శ్రీదేవికి ఇప్పుడు ఎనిమిది నిండాయి. 'క్యూట్'గా ఉండేది అప్పుడు. 'బ్రైట్'గా తయారయింది ఇప్పుడు. సంగీతంలో సెకండ్ గ్రేడ్‌కి చేరుకుంది. ఫ్లూట్‌కూడా బాగా వాయిస్తోంది. ఈ మధ్య టీవీలో రియాల్టీ షోలో పాల్గొనమని ఫ్రెండ్సు ఎంకరేజ్ చేస్తున్నారు. నేడోరేపో అది జరిగినా ఆశ్చర్యం లేదు. అయితే మేథ్స్‌లో కొంచెం వీక్‌గా ఉంది. ట్యూషన్ టీచర్ని పెట్టాను. ఆ టీచరు దృష్టి ఎప్పుడూ దాని బుగ్గల మీదే! మరేం ఫర్వాలేదు. లేడీ టీచరే లెండి!

శ్రీకర్‌కి మొన్ననే ఐదెళ్లి ఆరు వచ్చింది. బహుశా వాడు పాకుతుండగా చూసుంటారు మీరు. ఆమధ్యకాలంలో 'చిచ్చరపిడుగు' అని పక్కింటి వాళ్లచేత అనిపించుకున్నవాడు ఇప్పుడు స్కూల్లో 'బ్రిలియంట్' అని అనిపించుకుంటున్నాడు!: 'వాడి రిపోర్టు కార్డు మీద ఎప్పుడూ మీరే సంతకం పెడుతున్నారేం?' అని పిటియే మీటింగులో వాడి టీచరు అడిగింది. 'మా వారు ఫారెన్ వెళ్లారు మరి!' అని పిల్లాడికి వినిపించకుండా రహస్యంగా చెప్పి ఓ పిచ్చి నవ్వు నవ్వేసాను.




ఆ తర్వాత వాడు స్కూలుకోసం వేసిన పెయింటింగ్ 'మా కుటుంబం' బొమ్మని చూపించాను. ఎంతో బావుందని అవిడ పొగిడింది. అదెంత సహజంగా ఉందనుకున్నారు! మీరు కంప్యూటర్లో తల దూర్చినట్టు ఉన్నదున్నట్టుగా వేసాడు. వాడ్ని చూసి మనమెంతో గర్వపడాలి!

ఇక చిన్నారి శిరీషకి మొన్ననే మూడు నిండాయి. అది కడుపున పడటం ఒక్కటే మీకు తెలుసు. తర్వాత మీరు కంప్యూటర్ ప్రపంచంలో మునిగిపోయారు. అది పుట్టింది. దాని మూడవ పుట్టిన రోజు పండుగ కూడా గడిచింది. దాన్ని నర్సరీ క్లాసులో కూడా వేసాను. ఇవేవీ మీకు తెలియవు. అయినా, మీకో నిజం చెప్పనా! మీరు మీ చిన్నప్పుడు అచ్చం అలాగే వుండేవారట- ఆ మధ్య అత్తగారు వచ్చినప్పుడు నా చెవిలో చెప్పారు. అంటే తన ప్రపంచంలో ఉందంటే ఇంకేమీ దానికి పట్టవు! ఎప్పుడూ తనలో తానేమిటో మాట్లాడుకుంటూ ఉంటుంది. అది కంప్యూటర్‌ని ఎక్కడ చూస్తుందోనని నాభయం!

నాకేం! నేను బాగానే ఉన్నా! ఒకప్పుడు నా పెద్ద జడంటే మీకు చాలా యిష్టం. ఇప్పుడు నేను పూలు పెట్టుకుని లాభమేముంది? నా జుట్టు గురించి మెచ్చుకునే నా నాథుడు దగ్గర లేకపోయాక ఎందుకీ పోషణ అని చిక్కులు తీసుకునే ఆసక్తిలేక ఏడాది క్రితం బ్యూటీపార్లర్లో ట్రిమ్ చేయించుకున్నా! అదేం ఖర్మో - అప్పట్నించీ వీధి చివర్న కామేశంగారి రెండోవాడు ఆరాధనగా చూడ్డం మొదలు పెట్టాడు. అది వరకు 'ఆంటీ' అని పిలిచేవాడు - ఇప్పుడు 'యూ ఆర్ లవ్లీ' అని అంటున్నాడు. సర్లే వయస్సు తెచ్చిన పొగరని కళ్ళతోనే మందలించి ఊరుకున్నా! కాని, అదే రోజునుంచి మా బాస్‌కూడ నన్ను కళ్ళతో తినేస్తున్నాడు! మళ్లీ జడ కావాలంటే అర్జంటుగా ఎక్కడ్నించి తేగలను! కాగితాలు, ఫైళ్లు ఆయనకందిచేటప్పుడు కావాలని నా చేతివేళ్లు తాకుతూంటే.. ఇంటికి వచ్చాక డెట్టాల్తో కడుక్కుంటున్నా. ఇంతకన్నా ఏం చేయను చెప్పండి! ఒక్కసారి జుట్టు కత్తిరించుకున్నాక కత్తి మీద సామే అవుతోంది జీవితం.

ఇక మీ సంగతి,ఒక్కటే సుగుణం. భోజనంలోకి ఇది కావాలి అని ఇదివరకటిలా గొడవ చేయరు. నేను ఎప్పుడు 'తిండి' తెచ్చి మీ టేబిలుమీద పెడుతున్నానో కూడ మీకు తెలియదు. మీరు తిన్నవీ, తిననివీ ఎప్పుడు బయటకు తీసుకు పోతున్నానో మీకు తెలియదు. ఒకసారి మీతల మీదనుంచి కంప్యూటర్ దాకా సాలెగూడు పెట్టింది ఒక ఆర్టిస్టిక్ స్పైడర్! ఎంత ముచ్చటేసిందనుకున్నారు! వెంటనే కెమెరా తెచ్చి మీ ఫొటో తీసాను. ఆ ఫ్లాష్ కాంతికి మీరు ఉలిక్కి పడి నన్నో 'ఎలియన్'లా చూసి మళ్లీ మీకంప్యూటర్లోకి ముడుచుకుపోయారు! అప్పుడే మీ గుబురు గడ్డంమీద విన్యాసాలు చేస్తున్న సాలీడుని అతిలాఘవంగా పట్టి బయట పడేసాను. తర్వాత మీ కంప్యూటర్‌తోపాటు మీ జుట్టులోని మట్టినీ వేక్యూమ్ క్లీనర్‌తో శుభ్రం చేయకుండా ఉండలేకపోయా! ఆ పైన గదిలో కాస్త అటూయిటూ పెర్‌ఫ్యూమ్ స్ప్రే చేసి వెళ్లాను. బహుశ, మీ ముక్కు ఈ వాసనలకతీతమైన స్థితిలో ఉండుంటుంది!

సరే, గదులన్నీ (మీ గది తప్ప) క్రితం వేసవిలో వెల్ల వేయించాను. పక్క గదిలో మా చెల్లెలికి పెళ్లి చూపులు జరిగాయి. ఆ మధ్యదాని పెళ్లయి అత్తవారింటికి వెళ్లిపోయింది. మనింటికి వచ్చేవాళ్లకి మావారింకా ఫారెన్‌నుంచి రాలేదని చెప్పటం కాస్త కష్టంగానే ఉంటోంది!

ఇకపోతే, ఇప్పుడు మీకు ముఖ్యంగా చెప్పాల్సిన సంగతి ఒకటుంది. మా బాస్ - మా ఆఫీసు స్టాఫ్ నందర్నీ మూడు రోజుల లాంగ్ పిక్నిక్‌కి తీసుకు వెడుతున్నాడు. నా మీద 'కన్నేసి' తన ఖర్చుతో ఇంత పెద్ద పిక్నిక్ వేసాడని మా సరళ జోక్ చేస్తోంది. అది నిజమేమోనని నా భయం. మింగలేను. కక్కలేను. తప్పించుకుందామని 'మావారు ఊళ్లో లేరు' అన్నాను అప్పటికీ! 'మీ ఆయన లేనప్పుడు ఈ పిక్నిక్‌ని నువ్వసలే మిస్సవకూడదు. పిల్లలు సంతోషిస్తారు' అన్నాడు!

వాళ్ల కంపెనీకి ఆయన పిల్లలు కూడా వస్తారన్నాడు. ఇక కాదనటం ఎలా?

నేను లేనప్పుడు మీకేలోటు రాకూడదని మా చెల్లెలు పెళ్లికి వెళ్లినప్పుడు పెట్టినట్టే ఓ మనిషిని పెట్టాను. ఏ వేళప్పుడు మీ గదిలోకి వచ్చి భోజనం, కాఫీ అవీ పెట్టాలో లిస్టు రాసి పెట్టాను. మీకు ఏఏ కూరలు, పచ్చళ్లు ఇష్టమో చేసి చూపించాను. మేమింట్లో లేకపోయినా మీకూ, మీ కంప్యూటర్‌కీ ఏ లోటు రాదని భావిస్తున్నా!

ఒక్క ప్రార్థన! క్రితం సంవత్సరం.. మన పెళ్లి రోజు వెళ్లిపోయిన ఏడవ రోజున మీ కంప్యూటర్ 'రీబూట్' అయ్యే విరామ సయంలో కాబోలు నేను మీకు కాఫీ యివ్వటానికి మీ గదిలోకి వచ్చినప్పుడు 'పొరపాటునో - ఏమో' నన్ను వాటేసుకుని ఒక్కసారి గట్టిగా ముద్దెట్టుకున్నారు. ఆ తర్వాత మళ్లీ ఆ వసంతం నా జీవితంలో కురవలేదు. పోనీలే - దొరికిందే మహాభాగ్యమని సరిపెట్టుకున్నా. నేనూ పిల్లలూ ఊళ్లో లేప్పుడు మళ్లీ అలాటి పొరపాటు మాత్రం చేయకండి! మా చెల్లెలి పెళ్లికి వెళ్లినప్పుడు పెట్టాను చూశారా - ఆ మనిషి ఇప్పుడు దొరకలేదు. నేనిప్పుడు పెట్టి వెడుతున్న వంటమనిషి వయసులో ఉన్నది. అందమైనది. 'మావారు కంప్యూటర్ ప్రపంచంలోంచి కళ్లెత్తి చూడరు. పన్నెత్తి పలకరించరు. నీకేం భయంలేదు' అని ఆ అమ్మాయికి భరోసా ఇవ్వటమే కాదు ముందో రోజున నా బదులు ఆమెను మీ గదిలోకి పంపాను. ఆప్పటికామెకి నమ్మకం కుదిరింది. అయినా, ముందు జాగ్రత్తకోసం ఇదంతా..

ఇక ఉండనా మరి.

విధేయురాలైన మీ భార్య 'సుమతి'

- తటవర్తి రామచంద్రరావు